క్లుప్తంగా

అమ్మవారికి ఆషాఢ మాసం సారె



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): సత్తెనపల్లి పట్టణంలోని త్రిశక్తి దుర్గాపీఠంలో అమ్మవారికి ఆషాడ మాసం ను పురస్కరించుకుని సారెను ఆదివారం సమర్పించారు. సాంప్రదాయ బద్ధంగా జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి సారెను సమర్పించారు. ఆలయ పీఠాధిపతి వెలిదిండల హనుమంతురావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రమాదవశాత్తూ చెరువులో పడి వ్యక్తి మృతి



క్రోసూరు: క్రోసూరుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త షేక్ సుభాని(40) ప్రమాదవశాత్తు చెరువులో పడి ఆదివారం మృతి చెందాడు. మృతునికి భార్య , ఇద్దరు సంతానం కలరు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు లారీ డ్రైవర్‌గా పనిచేసే షేక్ సుభాని ఆదివారం చేపలు పట్టుకునేందుకు చెరువువద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిపోవడంతో ఈతరాక మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మృతుని కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఆయన వెంట జెడ్పీటీసీ షేక్ జమీలాగఫూర్, మండల పార్టీ అధ్యక్షుడు వెలది అప్పారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటిదాసు, కోటిరెడ్డి, తదితరులున్నారు.

కౌలురైతులకు సీసీఆర్‌సి కార్డులు

నకరికల్లు: కౌలురైతులకు సీసీఆర్‌సి కార్డులను ప్రభుత్వం మంజూరు చేస్తోందని కౌలురైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి దేవదాసు ఆదివారం తెలిపారు. కౌలురైతులు సాగుచేస్తున్న పొలం ప త్రాలు జిరాక్స్, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు ఫొటోలతో రైతుభరోసా కేంద్రాల్లో గాని గ్రామ వ్యవసాయ సహాయకులను గాని సంప్రదించాలన్నారు. వీఆర్వోల ద్వారా వివరాలు సేక రించి తహసీల్దార్ కార్యాలయంలో సీసీఐఆర్‌సి గుర్తింపు కార్డు మంజూరు చేస్తారన్నారు. 11 నెలల కాలపరిమితి ఉంటుందన్నారు.

పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల ఆదర్శ పాఠశాలలో 7,8,9 తరగతుల్లో ఖాళీల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మజ ఆదివారం తెలిపారు. ఈనెల 27 వరకు దరఖాస్తుల్ని తీసుకుంటామన్నారు. ఈనెల 28న ఉదయం 10 గంటలకు మెరిట్, రోస్టర్ విధానంలో సీట్లు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

జగద్గురువు శ్రీకృష్ణుడు



చిలకలూరిపేట టౌన్: ఆషాఢ మాసంలో గురు పౌర్ణమి నాడు శ్రీకృష్ణుడిని జగద్గురువుగా భావించి పూజలు చేయాలని పిడుగురాళ్లకు చెందిన త్రైత సిద్ధాంతం -ప్రబోధ సేవా సమితి సభ్యులు తెలిపారు. పట్టణంలోని పండరీపురంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆషాఢ మాసంలో చంద్రుడు గుండ్రంగా, పెద్దగా ఉండటం వల్ల గురు పౌర్ణమిగా నిర్ణయించారన్నారు. భగవంతుడిగా భూమిపై అవతరించిన శ్రీకృష్ణుడిని జగద్గురువుగా భావించి పూజలు చేయాలని వివరించారు, కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు కటికం సైదారావు, కె. అరుణ, కె. కోటేశ్వరరావు, నారాయణమ్మ, గోపి పాల్గొన్నారు.

శ్రీ రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

వినుకొండ (నూజెండ్ల): వినుకొండలోని కొండపై గల శ్రీరామలింగేశ్వరస్వామికి ఆదివారం శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అన్నదానం కమిటీ సభ్యులు పంచామృత అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు సామూహికంగా పొంగళ్లు పొంగించి నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా అన్నదాన కమిటీ అధ్యక్షుడు జాజుల మాల్యాద్రి మాట్లాడుతూ తొలి ఏకాదశి పండుగ తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 29న భారీ అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. జెట్టి శ్రీనివాసరావు, ముప్పాళ్ల రమేష్, బద్దిక నరసింహారావు, రాము, వెంకటేశ్వర్లు, కృష్ణవేణి, పద్మ, పార్వతి, 108 సేవకులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం..ఇంటికే సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే నంబూరు శంకరావు



తాళ్లచెరువులో మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

అచ్చంపేట: అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రతి ఇంటి ముందుకు సంక్షేమ పథకాలను చేర్చడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేసున్నారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాళ్లచెరువులో ఆదివారం రాత్రి గడప గడపకు తిరిగి అందుతున్న సంక్షేమ పథకాల వివరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ఎవరికి ఎంత లబ్ధిచేకూరిందో వివరించారు. ప్రభుత్వ సంక్షేమ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాల్లో భాగంగా సంక్షేమ పథకాలన్నింటికి అర్హతను బట్టి 95 శాతం మందికి ఇవ్వడం జరిగిందన్నారు. వివిధ కారణాలవల్ల ఎవరికైన అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే ఇంటింటికి సర్వే నిర్వహించేందుకు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఈనెల 30వరకు మీ ఇంటికి వస్తారని చెప్పారు. అర్హత ఉన్న ఏఒక్కరూ లబ్ధిపొందకుండా ఉండకూడదన్న లక్ష్యంతోనే సీఎం జగన్ జగనన్న సురక్ష పథకాన్ని తీసుకువచ్చారన్నారు. ఈ పథకం ద్వారా జులై 1 నుంచి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అర్హతను బట్టి పథకాలను చేరవేయడం జరుగుతుందన్నారు. ముందుగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలో రూ.45 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమును నిర్మించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంజూరు ఉత్తర్వులిచ్చారన్నారు. గ్రామస్తులకు గత నాలుగేళ్లలో రూ.25 కోట్ల సంక్షేమ లబ్ధి చేకూరిందన్నారు. రూ.3 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. త్వరలో అంతర్గత రహదారులు నిర్మించి, సైడు కాలువలు నిర్మించనున్నట్లు చెప్పారు. ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరికి మంచి జరిగిందనుకుంటేనే తిరిగి తమను ఆశీర్వదించమని కోరారు.

రూ.28 కోట్లతో సంక్షేమాభివృద్ధి పనులు

గత నాలుగేళ్లలో తాళ్లచెరువులో రూ.28 కోట్ల సంక్షేమాభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. మండలంలో తాళ్లచెరువులోనే అత్యధిక నిధులు కేటాయించడం జరిగిందన్నారు. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా 870 మంది రైతులకు రూ.1.95 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్సార్ ఆసరా ద్వారా 990 మందికి రూ.2.68 కోట్లు, అమ్మ ఒడి ద్వారా 388 మంది తల్లులకు రూ.1.59 కోట్లు, చేయూత ద్వారా రూ.240 మందికి రూ.1.26 కోట్లు నేరుగా వారి వారి బ్యాంకు ఖాతాలకు జమచేయడం జరిగిందన్నారు. పెన్షన్ కానుక కింద 728 మంది అవ్వాతాతలకు, అక్కచెల్లెమ్మకు రూ. 7.49 కోట్లు ప్రతి నెల 1వ తేదీనే అందచేస్తున్నామన్నారు. గ్రామంలో 304 మంది నిరుపేదలకు ఇంటి స్థలపట్టాలు ఇచ్చామన్నారు. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ. 17.5 లక్షలతో హెల్త్ సెంటర్ భవనం నిర్మించామన్నారు. నాడు నేడు పథకం ద్వారా రు.10 లక్షలతో పాఠశాలలను ఆధునీకరించడం జరిగిందన్నారు. రూ.1.15 కోట్లతో జలజీవన్‌మిషన్ ద్వారా ఇంటింటికి మంచి నీటి కుళాయిలు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, సర్పంచ్ కిక్కురు అర్లారెడ్డి, ఎంపీటీసీ గోవు అంతోనిరెడ్డి, మాజీ సర్పంచ్ తుమ్మా చిన్నపరెడ్డి, రైతు నాయకులు తుమ్మా లూర్దుమర్రెడ్డి పాల్గొన్నారు.

జులై 1 నుంచి జగనన్న సురక్ష

- 30 వరకు ఇంటింటికి సర్వే
- ఎంపీడీఓ శివసుబ్రమణ్యం

వ.నెం	తేదీ	ఎంపీడీఓ టీము పర్యటించే గ్రామం	తహసీల్దారు టీము పర్యటించే గ్రామం
1	01.07.2023	మాదిపాడు	కొండూరు
2	04.07.2023	చల్లగరిగ	గ్రంథశిరి
3	05.07.2023	తాడువాయి	ఓర్వకల్లు
4	11.07.2023	చింతపల్లి	కోగంటివారిపాలెం
5	13.07.2023	కొత్తపల్లి	కస్తల
6	18.07.2023	తాళ్లచెరువు	వేల్పూరు
7	20.07.2023	పెదపాలెం	చిగురుపాడు
8.	25.07.2023	కోనూరు	అచ్చంపేట
9	27.07.2023	అచ్చంపేట	--

అచ్చంపేట: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయాలన్న లక్ష్యంతో జులై 1 నుంచి జగనన్న సురక్ష పథకాన్ని ప్రభుత్వం చేపట్టిందని ఎంపీడీఓ పి.శివసుబ్రమణ్యం ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమం జులై 27 వరకు కొనసాగుతుందన్నారు. ఇందుకు గాను ముగ్గురు సభ్యులతో కూడిన రెండు టీములు వేసినట్లు చెప్పారు. మొదటి టీములో ఎంపీడీఓ అయిన తనతోపాటు మరో ఇద్దరు ఉద్యోగులు, రెండవ టీములో తహసీల్దారు సీహెచ్ పద్మాదేవితోపాటు మరో ఇద్దరు ఉద్యోగులుంటారన్నారు. ఈనెల 30 వరకు తమ బృందంతోపాటు గ్రామ వలంటీర్లు సచివాలయ పరిధిలోని ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించి, ఇంటింటికి తిరిగి సర్వే చేసి అర్హత ఉండి లబ్ధిచేకూరనివారి జాబితాలు తయారు చేయడంతో పాటు, వారికి కావలసిన ధృవీకరణ పత్రాల వివరాలు తెలుసుకుని జులై 1 నుంచి జరిగే జగనన్న సురక్ష సభలలో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే, వలంటీర్ లబ్ధిదారులకు డాక్యుమెంట్స్ తయారీలో పూర్తి సహకారం అందించాలన్నారు. వలంటీర్ ఇంటింటికి తిరిగి అప్లికేషన్ సర్వే మాత్రమే చేస్తారని, వలంటీర్ లాగిన్‌లో టోకెన్ జెనరేట్ అవ్వదు అనే విషయాన్ని లబ్ధిదారులు గుర్తించాలన్నారు. వలంటీర్ లబ్ధిదారులు కావలసిన సర్వీసులు గుర్తించి, వాటికి కావాల్సిన డాక్యుమెంట్స్ జత పరిచి డిజిటల్ అసిస్టెంట్ లేదా వెల్ఫేర్ - ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లేదా గ్రామ రెవెన్యూ అధికారి లేదా పంచాయతీ కార్యదర్శి సమరిృంచాలన్నారు. ఈ నలుగురిలో ఎవరోఒకరు వారి ఏపీ సేవ పోర్టల్ లో టోకెన్ జారీ చేస్తారన్నారు. లబ్ధిదారుడి ప్రతి సర్వీసుకు ఒక టోకెన్ జారీ అవుతుంది. టోకెన్ జారీ అయిన తరువాత డిజిటల్ అసిస్టంట్ లాగిన్ లో సర్వీస్ అప్లయ్ చేస్తారన్నారు. టోకెన్ జారీ, సర్వీస్ రిక్వెస్ట్ షెడ్యూల్ తేదీకి వారం ముందు నుంచి ప్రారంభం చేయవచ్చు. కానీ సర్టిఫికెట్స్ క్యాంప్ జరిగిన తేదీన ప్రింట్ ఇవ్వాలన్నారు. టోకెన్ క్యాంప్ తేదీ వరకే చెల్లుబాటు లో ఉంటుందన్నారు

జగనన్న సురక్ష క్యాంప్ లో ఆధార్ సేవలు...

జగనన్న సురక్ష క్యాంప్ లో ఆధార్ డ్రైవ్ కూడా జరుగుతుందని. ఇందులో ఆధార్ కార్డ్ మొబైల్ లింకింగ్ కొరకు మాత్రమే టోకెన్ జారీ చేస్తారని, బయోమెట్రిక్ అప్డేట్ సర్వీస్ కొరకు మరియు ఇతర సర్వీస్ ల కోసం టోకెన్లు జారీ చేయరని తెలిపారు. ఆధార్ లో మొబైల్ అప్డేట్, తప్పని సరి బయోమెట్రిక్ అప్డేట్ సేవలు మాత్రమే ఉచితంగా అందించబడతాయన్నారు.

జగనన్న సురక్ష షెడ్యూల్

పెదకూరపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాని విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ నరసింహరావు కోరారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని 14 సచివాలయాల పరిధిలో రెండు టీంలుగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.టీ-1లో తహసీల్దార్ క్షమా రాణి, ఈఓపీఆర్‌డి శ్రీనివాసరావు, సినియర్ అసిస్టెంట్ ఆనంద్ శేఖర్, టీ-2లో ఎంపీడీఓ నరసింహిరావు, డిప్యూటీ తహసీల్దార్ నిర్మల కృష్ణ, టైపిస్టు నాగజ్యోతిలు ఉన్నారు . జూలై 1 వతేదీన 75 త్యాళ్ళూరు, జలాల్‌పురం, 4వ తేదీన కంభంపాడు, కాశిపాడు, 6వ తేదీన బలుసుపాడు, పాటిబండ్ల, 11న గారపాడు, హుస్సేన్‌నగరం, 13న ముస్సాపురం, లింగంగుంట్ల, 18న పెదకూరపాడు-2, పెదకూరపాడు-1, 20న పెదకూరపాడు-3, లగడపాడు సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష ఎంపీడీఓ మాధురి

అమరావతి: మండల పరిదిలోని ప్రజలు జగనన్న సురక్ష పథకానికి దరఖాస్తు చేసుకునే విధానాన్ని ఆదివారం ఎంపీడీఓ మాధురి ఒక ప్రకటనలో వివరించారు. తొలుత వలంటీర్ జగనన్న సురక్ష సర్వే చేసి, ప్రజలకు అవసరమయ్యే సర్వీసులు గుర్తించాలని, వాటికి సంబందించిన డాక్యుమెంట్స్ ఉంటే సేకరించాలన్నారు. డాక్యుమెంట్స్ లో ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే సచివాలయంలో సంప్రదించాలని

జగనన్న సురక్ష విజయవంతం



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన జగనన్న సురక్ష కార్యక్రమం సత్తెనపల్లి నియోజకవర్గంలో మొదటి రోజు విజయవంతమైందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజవర్గంలోని పట్టణంతో పాటుగా నాలుగు మండలాల్లో ప్రారంభమైన సర్వేలో వలంటీర్లు, గృహసారథులు సచివాలయ సిబ్బంది పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు. నియోజకవర్గంలో మొదటి రోజు 2,579 ఇళ్ళను సర్వే చేయగా 96 సమస్యలు గుర్తించి టోకెన్లు అందించడం జరిగిందని చెప్పారు. రాజుపాలెం మండలంలోని చౌటపాపాయపాలెంలో 310 ఇళ్ళను సర్వే చేయగా 19 సమస్యలను గుర్తించి వారికి టోకెన్లు ఇచ్చారన్నారు. ముక్కపాడులో 344 ఇళ్ళను సర్వే చేయగా 11 సమస్యలు గుర్తించామన్నారు. నకరికల్లు మండలం చల్లగుండ్లలో సర్వే 387 ఇళ్ళను సర్వే చేస్తే సమస్యలు లేవన్నారు. ముప్పాళ్ళ మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో 214 ఇళ్ళను సర్వే చేయగా 15 సమస్యలు గుర్తించి వాటికి టోకెన్లు అందజేశారన్నారు. అలాగే ఇరుకుపాలెం 90 ఇళ్ళ ను సర్వే చేస్తే 20 సమస్యలు గుర్తించి టోకెన్లు అందించారన్నారు. సత్తెనపల్లి మండలం గుడిపూడిలో 410 ఇళ్ళను సర్వే చేస్తే 5 సమస్యలు వచ్చాయన్నారు. పెదమక్కెనలో 354 ఇళ్ళను సర్వే చేస్తే 17 సమస్యలు గుర్తించి టోకెన్లు అందించారన్నారు. సత్తెనపల్లి పట్టణంలో 2వ సచివాలయంలో 470 ఇళ్ళను సర్వే చేస్తే 9 సమస్యలు గుర్తించి టోకెన్లు అందించారన్నారు. జులై 1వ తేదీ వరకు జరిగే సర్వేలో గుర్తించిన సమస్యలను ఆయా మండలాల్లో ఆయా ప్రాంతాల్లో క్యాంపులు పెట్టి పరిష్కరించటం జరుగుతుందన్నారు. లోపాలుంటే సరిదిద్దుకొని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, గృహసారథులు ముమ్మరంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు.

కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ



కమ్యునిటీ హాల్‌కు భూమి పూజ చేస్తున్న మంత్రి అంబటి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

రాజుపాలెం: గతంలో ఇచ్చిన మాటప్రకారం ఎంపీ నిధులతో కమ్యునిటీ హాల్‌కు భూమి పూజ చేసినట్లు రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు , ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మండల కేంద్రంలోని రాజుపాలెం ఆర్ ఆర్ సెంటర్లో రూ. 25 లక్షల నిధులతో కమ్యునిటీ హాల్‌కు ఆదివారం భూమి పూజ చేశారు. ముందుగా జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, సర్పంచ్ పులిబండ్ల అశోక్‌లు రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబును, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర మంత్రి అంబటి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇక్కడ ఇళ్లు నిర్మించుకోవడం ఎంతో అదృష్టమని అన్నారు. ఆయనను గుండెల్లో పెట్టుకున్నారని, ఆయన తరువాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చక్కటి పరిపాలన అందిస్తున్నారని, ఆయనను గెలిపించే బాధ్యత మీదేనని అన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల అభీష్టంమేరకే పని చేస్తోందని తెలిపారు. కమ్యునిటీ హాల్‌ను త్వరగా నిర్మించాలని సూచించారు. సమావేశానికి సర్పంచ్ పులిబండ్ల అశోక్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, ఎంపీటీసీ బత్తుల సాంబశివరావు, వేమవరపు యాకోబు, గల్లా ప్రభాకరరావు, గోసంగి దేవదానం , చాట్ల రాజు, తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వెద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కళ్యాణి

అమరావతి: గ్రామీణ ప్రాంత ప్రజలకు వివిధ రకాల వైద్యసేవలను అందించడానికి స్థానిక శ్రీలక్ష్మీ హాస్పటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈశిబిరాన్ని ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించారు. వివిధ విభాగాల్లో నిష్ణాతులైన వైద్యులు రామాంజనేయులు, కమలాకర్, రాజశేఖర్, శ్రీనివాస్, మేకల శ్రీధర్, నెక్కంటి కళ్యాణి, శ్రీధర్‌చంద్‌లు 242 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే రోగనిర్ధారణ పరీక్షలు చేసి సుమారు రూ. 25వేల రూపాయల మందులు ఉచితంగా రోగులకు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో మండల పరిధి గ్రామాల నుంచి రోగులు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర నాగేశ్వర రావు,తో పాటుగా అస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పెదకూరపాడు: మండలంలోని బలుసుపాడు గ్రామంలో ఆదిత్య మల్టీస్పెషాలిటి వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాని వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు బచ్చు హనుమంతురావు, డాక్టర్ కృష్ణ శ్రావంత్, న్యూరాలజి వైద్య నిపుణులు డాక్టర్ చదలవాడ ఆమూల్య, కార్డియాలజి వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణప్రసాద్‌లు ప్రారంభించారు. ఈ శిబిరంలో 200 మంది రోగులకు పరీక్షలు చేసి సమస్యలు ఉన్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలని వినతి

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): రైతుభరోసా కేంద్రంలో ఖాళీగా ఉన్న యానిమల్ హస్బండరీ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జీ.రామన్న కోరారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ)యానిమల్ హస్బండరీ అసిస్టెంట్(ఏహెచ్ఏ) ఆధ్వర్యంలో విజయవాడలోని పశుసంవర్ధశాఖ డైరెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో రామన్న మాట్లాడుతూ ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చినప్పటికీ అధికారులు కొత్తగా క్లస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి 3 నుంచి 5 రైతు భరోసా కేంద్రాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి మిగులు పోస్టులను చూపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో గత మూడు సంవత్సరాల నుంచి డైరీ ఒకేషనల్ మరియు డిప్లొమా చదివిన అభ్యర్థులు సుమారు 30 వేల మందికి పైగా నష్టపోతున్నారన్నారు. ఈ క్లస్టర్ విధానం వల్ల అభ్యర్థుల్లో ఆందోళన నెలకొందన్నారు. ఈ విదానాన్ని రద్దు చేసి ఖాళీగా ఉన్న 4,765 పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తులసి, ఆంజనేయరాజు, నాయకులు పెండ్యాలమహేష్, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణుల్లో సృజనాత్మకత, నైపుణ్యత నవీకరణకు కృషి


పలు గ్రామాలోపల్లె సృజన స్వచ్ఛంద సంస్థ సభ్యుల పర్యటన



అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాల్ని ఏరి వేస్తున్న సభ్యులు

బొల్లాపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో సృజనాత్మకత, నైపుణ్యత గుర్తించి నవీకరణతో పాటు పర్యావరణాన్ని కాపాడడంలో పల్లె సృజన స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తోంది. ఈ దిశగా సభ్యులు ఇప్పటిదాకా అనేక కార్యక్రమాలు చేపట్టారు. మూడ్రోజులుగా ఈపూరు మండలం కొండ్రముట్ల నుంచి బొల్లాపల్లి మండలం మేళ్లవాగు వరకు సుమారు 36 కిలో మీటర్లు కాలినడకన పలు గ్రామాల్ని సభ్యులు సందర్శించారు. అటవీ ప్రాంతాల్లోనూ అనేక కార్యక్రమాలు చేపట్టారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అటవీ ప్రాంతాన్ని కాపాడుకోవాలని బృందం సభ్యులు గ్రామీణ ప్రాంతవాసులకు సూచించారు. ఆదివారంతో మేళ్లవాగు వద్ద పర్యటన ముగించారు. దాదాపుగా 22 మందికి పైగా సభ్యులతో కూడిన బృందం ఆయా గ్రామాల్ని కాలినడకన సందర్శించింది. వీరిలో విద్యావంతులు, ఉన్నత ఉద్యోగస్తులు ఉన్నారు. సమాజ సేవతో పాటు గ్రామాల్లో నైపుణ్యతను గుర్తించి పట్టణాలకు అందజేయడమే ప్రధాన ఉద్దేశమని పల్లెసృజన వ్యవస్థాపకులు పోగుల గణేశం, పర్యావరణ సామాజిక కార్యకర్త కొమిరి జాజి తెలిపారు. గ్రామస్థాయిలో ఎంతో నైపుణ్యత దాగి ఉందని, అక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించుకునే శాస్త్రవేత్తలు ఉన్నారని తెలిపారు. పచ్చదనం, పర్యావరణాన్ని కాపాడడం కోసం అటవీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేతతో పాటు అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో సీడ్ బాల్స్‌ను అటవీ ప్రాంతంలో చల్లినట్లు చెప్పారు.

ఒయాసిస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులతో సంస్థ సభ్యులు

చిలకలూరిపేట టౌన్: చదువుకు పేదరికం ఆటంకం కారాదని ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ తెలిపారు. పట్టణంలోని కేజే ఆసుపత్రి ప్రాంగణంలో ఆదివారం పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 18 మంది విద్యార్థులకు రూ. 7వేల చొప్పున మొత్తం రూ. 1.26 లక్షలను అందించారు. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు పైచదువుల నిమిత్తం సంస్థ చేయూత నిస్తుందని చెప్పారు. గత పదేళ్లుగా అనేక మందికి అండగా నిలిచిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కారుమంచి శివరావు, జాష్టి ప్రమీల, బి. సుబ్బారావు, గంజి చెంచుకుమారి, కందిమళ్ల నారాయణమూర్తి, ఎండీ. కరీమా, కరణం విజయ పాల్గొన్నారు.

ఆది పరాశక్తి క్షేత్రంలో ప్రత్యేక పూజలు

నాదెండ్ల: గణపవరం గ్రామ పరిధిలోని శివప్రియనగర్ ఆది పరాశక్తి క్షేత్రంలో గల గండి పోచమ్మ ఆలయంలో ఆర్యవైశ్య ప్రముఖులు ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపుతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహిస్తే అనుకున్న కోరికలు తీరుతాయని నమ్మకంతో కొమ్ములు దంచారు. అభిషేకాలు జరిపారు. అనంతరం పీఠాధిపతి శ్రీ నిత్య విద్యానంద భారతీస్వామి ఆశీస్సులతో తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, శ్రీశైలం వాసవీ సత్రం మెంబర్ అనుమాల సుబ్బారావు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నరసరావుపేట: భవన నిర్మాణ కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని, సంక్షేమ పథకాలన్నిటినీ పునఃప్రారంభించాలని ఏపీ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వి. నరసింహారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వనున్నామని, అప్పటికీ ఫలితం లేకపోతే చలో విజయవాడ నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులో గల సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం పల్నాడు జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరు కాగా, సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సిలార్ మసూద్, ఉపాధ్యక్షుడు కొమ్ముల సురేష్, సహాయ కార్యదర్శులు కోట ఆంజనేయులు, చిలక యేసు, కొత్తపల్లి సాంబశివరావు, కాసు కోటిరెడ్డి పాల్గొన్నారు.

వివాహానికి మంగళ సూత్రం బహూకరణ



చిలకలూరిపేట టౌన్: వివాహం చేసుకుంటున్న దంపతులకు 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు సహకారం అందించారు. మండలంలోని పసుమర్రులో ఆదివారం మాదాసు వీరాస్వామి, సామ్రాజ్యం దంపతుల కుమారుడు దీనరాజు వివాహం సందర్భంగా మంగళసూత్రం బహూకరించారు.

గంగమ్మ తల్లికి ట్రాన్స్‌జెండర్స్ బోనాలు



బోనాలు ప్రదర్శిస్తున్న ట్రాన్స్‌జెండర్లు

నరసరావుపేట: పట్టణంలో ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం ట్రాన్స్‌జెండర్లు ప్రకాష్‌నగర్‌లోని గంగమ్మ తల్లికి మేళాలతో బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భిక్షాటన ద్వారా జీవనం చేసే తమకి దానం చేసిన ప్రతి ఒక్కరూ పిల్లాపాపలతో చల్లగా, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటామన్నారు. ప్రతి ఆషాఢంలో పూజల్ని నిర్వహిస్తామని, మొదటిసారిగా పల్నాడు జిల్లా ఏర్పడిన తరుణంలో తాము జిల్లా కేంద్రంలో ఉన్నందుకు గర్వపడుతున్నామని పేర్కొన్నారు. తమకు అన్ని విధాలుగా సహకరిస్తున్న కలెక్టర్ ఎల్.శివశంకర్, పోలీసు ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తమకు ఏ ప్రభుత్వం కల్పించని విధంగా వైస్సార్ సీపీ ప్రభుత్వం సొంత ఇళ్లను ఇచ్చిందని, తమకు సహకరించిన కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

విద్యుదాఘాతంతో మూడు పాడి గేదెలు మృతి



ఈపూరు: విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో మూడు పాడి గేదెలు మృతి చెందిన సంఘటన ఈపూరులో ఆదివారం చోటు చేసుకుంది. వారం రోజుల కిందట గాలివానకు గ్రామంలో విద్యుత్ వైరు తెగిపడింది. సిబ్బంది మరమ్మతులు చేపట్టకుండా వదిలివేశారు. ఈ క్రమంలో అటువైపు మేత కోసం వెళ్లిన కొంగ వీరయ్య, అంజయ్య, బుజ్జిలకు చెందిన పాడి గేదెలు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. గేదె ఒక్కొక్కటి విలువ రూ. 50 వేలు ఉంటుందని, పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

రొంపిచర్లలో..

విద్యుత్ తీగలు తగిలి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని అన్నవరంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తిరువీధుల వెంకయ్యకు చెందిన గేదె మధ్యాహ్నం పొలాల్లో గడ్డి మేస్తుండగా, తెగిన విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ. లక్ష ఉంటుందని వెంకయ్య వాపోయారు.